క్లుప్తంగా

ప్రింటర్ బహూకరణ



దుగ్గొండి : మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు బుధవారం రూ.17వేల విలువ గల జిరాక్స్ కమ్ ప్రింటర్ మిషన్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు వెంకట్రావ్, సుమలత, కరంచంద్, ప్రభాకర్, శ్రీనివాస్, మాధవి, సంధ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన



ఖానాపురం : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల స్పెషల్ ఆఫీసర్ ప్రదీప్ అన్నారు. ఈ మేరకు మండలంలోని ధర్మరావుపేట రైతువేదికలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుమణవాణి, డాక్టర్ భూపేష్, సర్పంచ్ వెన్ను శృతి, కార్యదర్శి చంద్రశేఖర్, ఏఎన్‌ఎం సుజాత ఉన్నారు.

బీజేపీలో చేరిక




చెన్నారావుపేట : మండలంలోని కాల్‌నాయక్ తండాకు చెందిన 30 మంది యువకులు బుధవారం బీజేపీ నాయకుడు డాక్టర్ రాణా ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీజేపీ నర్సంపేటలో జెండా ఎగురవేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో గుగులోత్ రాకేష్, లావుడ్యా నాగరాజు, అంజి, మహేందర్, ప్రశాంత్, సాగర్, ప్రకాశ్, భద్రు, జితేందర్ ఉన్నారు.

'బీఆర్‌ఎస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలి'



నర్సంపేట : ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎండగట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. అనంతరం 19వ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాట రఘు, ఉపాధ్యక్షులుగా చింతల క్రాంతి, మేడబోయిన రాజు, ప్రధాన కార్యదర్శిగా గోపి, సహాయ కార్యదర్శి పుట్టపాక వీరస్వామి, కొలువుల స్వామి, చింతల కార్తీక్, గుండు రవిరాజ్, కోశాధికారి కీసరి రాజీవ్, ఇతర సభ్యులను ఎన్నుకున్నారు. పెండెం రామానంద్, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, వేముల సాంబయ్యగౌడ్, చింతల సాంబరెడ్డి, బత్తిని రాజేందర్, కౌన్సిలర్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు పొదుపు నగదును అందజేస్తున్న సంఘం సభ్యులు

నర్సంపేట : నర్సంపేట పట్టణంలోని నెహ్రూనగర్ పురుషుల పొదుపు పరస్పర సహాయక సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న ఇప్ప రాజు, వీరాటి శ్రీనివాస్‌లు వేర్వేరు కారణాలతో మృతి చెందారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు ముత్యాల వీరస్వామి కార్యనిర్వహణలో సమితి అధ్యక్షుడు ఎండి.సాధిక్‌పాషా ముఖ్య అతిథిగా పాల్గొని బుధవారం సంఘం లావాదేవీలు పరిశీలించారు. పొదుపులు, క్రైమ్ అభయనిధి నుంచి ఒక్కొక్కరికి రూ.60వేల చొప్పున 1.20లక్షలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అడుప రాజేశ్వర్, పాలకవర్గం ముత్యం సూరయ్య, ఎదుబోయిన శోభన్, బండారి సంతోష్, ముత్యం రంజిత్, కాజీపేట కృష్ణమూర్తి, బండారి శివ, ఆకుల శ్రీనివాస్, గాండ్ల శివ, దూలం సాంబయ్య, బండారి రాజు, వల్లాజీ మోహన్‌లు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

పర్వతగిరి : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పి.శ్రీదేవి ఐదు నెలల పాటు విదేశాలకు వెళ్తున్నారు. కాగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా పీవీవీ గణేష్‌కుమార్‌ను కొనసాగాలని ఉత్తర్వులు వచ్చాయి. దీంతో మండల నోడల్ ఆఫీసర్ లింగారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన గణేష్‌కుమార్‌కు అధ్యాపకులు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీలు

- అద్దె భవనాల్లో కొనసాగుతున్న వైనం
- నిధులు కేటాయిస్తే అందుబాటులోకి..
- పట్టించుకోని పాలకులు, అధికారులు



అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

ఖానాపురం : అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగున్నాయి.. సొంత భవనం కల నెరవేరే అవకాశం కష్టంగా ఉంది. గతంలో నిర్మించ తలపెట్టిన అంగన్‌వాడీ కేంద్రాల భవననిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. నిధుల కేటాయింపు లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రం సొంత భవనాలు లేక అవస్థలు పడుతున్నారు. కొంత నిధులు కేటాయిస్తే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్న పట్టించుకునే వారు లేకపోవడంతో నిర్మాణాలు పూర్తికావడంలేదు.

ఖానాపురం మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి ద్వారా తెలంగాణ ప్రభుత్వం గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తుంది. 2017సంవత్సరంలో ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఒక్కో భవనానికి రూ.8 లక్షల చొప్పున రెండు భవనాలు మంజూరు చేసింది. పనులు ప్రారంభించిన తర్వాత ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఉన్న వాటికి మాత్రమే అనుమతివ్వాలని, బయట ఉన్న వాటిని వెంటనే నిలిపివేయాలంటూ ఆదేశాలు వచ్చాయి. దీంతో పాఠశాల సమీపంలోనే నిర్మించినట్లు వివరాలు నాటి కలెక్టర్‌కు పంపిన పనులు నిలిచిపోయాయి. అదే సమయంలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులు పూర్తి అయ్యే పరిస్థితి ఉండేది. ఆ తర్వాత పనులకు సంబంధించిన వెబ్‌సైట్ తెరుచుకోవడం లేదంటూ నిలిపివేశారు. ఈ భవనాలను పూర్తి చేయాలంటే ప్రస్తుతం మరో రూ.10లక్షల నిధులు అవసరం ఉంటుంది. నిధుల విడుదలతో పాటు నిర్మాణాలకు కావాల్సిన చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటంతోనే పనులు మధ్యలో నిలిచిపోయినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి భవనాలను పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి



అంగన్‌వాడీ భవనాలను అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో నిర్మాణాలు చేయించాలి. రెండు కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కేంద్రాలు అందుబాటులోకి తీసుకువస్తే అంగన్‌వాడీలకే వచ్చే పిల్లలకు ఇబ్బందులు లేకుండా ఉంటాయి. సంబంధిత శాఖ అధికారులు తక్షణమే స్పందించి నిర్మాణ అనుమతులు ఇప్పించాలి.

– వెన్ను పూర్ణచందర్, ధర్మరావుపేట

లింగగిరి జాతర హుండీ లెక్కింపు

- రూ.1,41,210 ఆదాయం
- వేలం పాటల ద్వారా రూ.40,100



కానుకలు లెక్కిస్తున్న సర్పంచ్, వార్డు సభ్యులు

చెన్నారావుపేట : మండలంలోని లింగగిరి గుట్టపై సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నాలుగు రోజుల పాటు జరిగిన శ్రీ లక్ష్మీచెన్నకేశవ జాతర హుండీ కానుకలను సర్పంచ్ మాదారపు భాస్కర్ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప సర్పంచ్ రాజశేఖర్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీలను లెక్కించడం జరిగిందన్నారు. రూ.1 లక్ష 41 వేల 210 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. వేలం పాటల ద్వారా రూ.40,100 వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చీకటి చిన్నరాజు, ప్రభాకర్, మల్లం సాగర్, పెద్ద రాజు, గ్రామ పెద్దలు ఉన్నారు.

విద్యుత్ తీగలకు అల్లుకున్న చెట్టుకొమ్మలు



చెన్నారావుపేట : మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల 11కేవీ, ఎల్‌టీ లైన్ విద్యుత్ తీగలకు చెట్టుకొమ్మలు అల్లుకుపోయి ప్రమాదకరంగా మారాయి. చెట్టును ముట్టుకుంటే షాక్ వచ్చే అవకాశాలు ఉన్నాయని సమీపంలోని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గాలి వీచినప్పుడు మంటలు చెలరేగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. వెంటనే విద్యుత్ అధికారులు చెట్టు కొమ్మలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

బియ్యం, నగదు అందజేత

ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన తమ్మే కొమురయ్య ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు నీరటి వెంకటనర్సయ్య, సర్పంచ్ కట్కూరి రాజమణితో కలిసి బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంకటనర్సయ్య 50 కిలోల బియ్యంతో పాటు రూ.2 వేల నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. వీరి వెంట బొక్కల నారాయణ, పులిగారి వెంకన్న, ఉసిల్ల రమేష్, మినుముల వెంకన్న, ఎల్లయ్య, కొరివి వెంకటస్వామి, చెరుకు వెంకటస్వామి, భూపతి తదితరులు ఉన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

హసన్‌పర్తి : 56వ డివిజన్ గోపాలపురంలో సీనియర్ సిటీజన్స్, విద్యారణ్యపురి, లయన్స్ క్లబ్ ఆఫ్ గోపాలపురం ఆధ్వర్యంలో బుధవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీనియర్ సిటీజన్స్, లయన్స్ క్లబ్‌లు చేపట్టే కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. ఈ సందర్భంగా మహిళలను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సుధాకర్, అడ్వైజర్ వేణుగోపాల్, సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు దామెర నర్సయ్య, కార్యదర్శి తేరాల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీల ఎన్నిక



నెక్కొండ: నియామకపత్రం అందిస్తున్న హరిప్రసాద్



పర్వతగిరి: మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

పర్వతగిరి : చింతనెక్కొండ గ్రామంలో బుధవారం శ్రీరామ సంఘం 18వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ధర్నోజు దేవేందర్, అధ్యక్షుడిగా కుడికాల శ్రీధర్, ఉపాధ్యక్షుడిగా సూరినేని సుధీర్ రావు, ప్రధాన కార్యదర్శిగా మాడూరి రాజు, సంయుక్త కార్యదర్శిగా కుడికాల మోహన్, కోశాధికారిగా మామిండ్ల శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా భూక్యా రాములు, నల్లపు రాములు, తొడోజు రమేష్, ఆడిట్ కమిటీ సభ్యులుగా పల్లెపాటి ప్రభాకర్‌రావు, పూజారి రాజు, క్యాషియర్‌లుగా బొల్లం రవి, పేరాల దేవేందర్‌రావు, శివరాత్రి రాజులు ఎన్నికయ్యారు. నూతన కమిటీ సభ్యులచే రిటైర్డ్ ఉపాధ్యాయుడు కుడికాల వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం సంఘం వ్యవస్థాపకుడు అక్కినపెల్లి సతీష్‌కుమార్, అధ్యక్షుడు కుడికాల శ్రీధర్ మాట్లాడారు. గ్రామంలో 18సంవత్సరాలుగా అత్యంత క్రమశిక్షణ, ఆదర్శవంతంగా సంఘ కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

నెక్కొండ : కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు కమిటీలు శక్తివంచన లేకుండా కృషిచేయాలని కాంగ్రెస్ పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పెండ్యాల హరిప్రసాద్ అన్నారు. మండలంలోని గుండ్రపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ కమిటీని బుధవారం ఆయన ప్రకటించారు. గ్రామఅధ్యక్షుడిగా బోళ్ల శివకుమార్, ఉపాధ్యక్షుడిగా పర్కాల మల్లయ్య ఎండీ. మదార్, ప్రధాన కార్యదర్శిగా ఆకుల శ్రీనివాస్, కార్యదర్శులుగా బొంపెల్లి శ్రీకాంత్, రొడ్డ సారయ్య, కోశాధికారిగా మందడి మంగారావు, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మాదిగ జేఏసీ మండల కార్యవర్గం

చెన్నారావుపేట : మాదిక జేఏసీ మండల అధ్యక్షుడిగా మందుల సాగర్‌ను నియమించినట్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నర్మెట్ట యాదగిరి బుధవారం తెలిపారు. అలాగే గ్రామ అధ్యక్షుడిగా పైసా సారంగం, యూత్ అధ్యక్షుడిగా బారపాక నవీన్, ఉపాధ్యక్షుడిగా బొమ్మకంటి సాగర్, ప్రధాన కార్యదర్శిగా ఆకులపెల్లి సుదర్శన్, కార్యదర్శిగా ఆకులపెల్లి సురేష్, ప్రచార కార్యదర్శిగా అందె రాజేష్, కోశాధికారిగా నర్మెట్ట ఈశ్వర్, అధికార ప్రతినిధి జంగిలి భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అందె ప్రవీన్‌లను ఎన్నుకున్నారు.

బీఆర్‌ఎస్ సభకు తరలిన నాయకులు



నర్సంపేట: బీఆర్‌ఎస్ సభకు వెళ్తున్న నాయకులు



నల్లబెల్లిలో..



నెక్కొండ: మండల కేంద్రంలో..

ఖమ్మంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ బహిరంగ సభకు ఆయా మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వాహనాలను స్థానిక ప్రజాప్రతినిధులు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీతో దేశ ప్రజలకు సేవ చేయడానికి సీఎం కేసీఆర్ ముందుకు వెళ్లడం సంతోషకరం అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సంగెం: బహిరంగ సభకు తరలి వెళ్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు



ఖానాపురంలో..



దుగ్గొండి: గిర్నిబావి నుంచి..



గీసుకొండ: ధర్మారం నుంచి..



గీసుకొండ: తరలివెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



వర్ధన్నపేటలో..



నర్సంపేట రూరల్‌లో..

కాంగ్రెస్ నాయకుల అరెస్టు దుర్మార్గం



వర్ధన్నపేట: అదుపులో నాయకులు



నల్లబెల్లి: కాంగ్రెస్, బీజేపీ నాయకులు



నెక్కొండ: పోలీస్‌స్టేషన్‌లో..

పర్వతగిరి : బీఆర్‌ఎస్ పార్టీ సభలు, సమావేశాలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇళ్లలో మంగళవారం రాత్రి పోలీసులు చొరబడి వారిని స్టేషన్లకు తరలించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొంపెల్లి దేవేందర్‌రావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకుని మంత్రులు, ఎమ్మెల్యేల మెప్పు కోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి దుర్మార్గపు చర్యలు దారుణమని ఆయన అన్నారు.

నెక్కొండ : ఖమ్మం జిల్లాలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆవిర్భావ సభలో నిరసనలు ప్రకటిస్తారన్న అనుమానంతో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకుల్ని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ తదితరులు ఉన్నారు.

ముందస్తు అరెస్టులు

వర్ధన్నపేట : బీజేపీ నాయకులను వర్ధన్నపేట పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు రాయపురం కుమారస్వామి, యువమోర్చా మండల అధ్యక్షుడు చెంగల సురేష్ తదితరులను ముందస్తు అరెస్టులు చేశారు.

కాంగ్రెస్, బీజేపీ నాయకులు..

నల్లబెల్లి : శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కాంగ్రెస్, బీజేపీ నాయకులను బుధవారం ముందస్తుగా అరెస్టు చేసినట్లు ఎస్సై నార్లాపురం రాజారాం తెలిపారు. అరెస్టు అయిన వారిలో చిట్యాల తిరుపతి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వైనాల అశోక్, బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు బొద్దురెడ్డి ప్రతాప్ రెడ్డి ఉన్నారు.

రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు చిన్న

రాయపర్తి : రాష్ట్రంలో రాబందుల పాలన కొనసాగుతోందని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గోదాసి చిన్న అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు గోరంట్ల ప్రభాకర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బంగారు తెలంగాణ చేస్తానని చెప్పి బంగారు కుటుంబంగా మార్చుకున్నారని ఆరోపించారు. ఎంతో మంది విద్యార్థుల బలిదానంతో గద్దెనెక్కిన ఈ ప్రభుత్వం విద్యార్థుల పాలిట శాపంగా మారిందన్నారు. స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్‌లు రూ.వేల కోట్లు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయకపోతే బీజేవైఎం ఆధ్వర్యంలో ప్రగతిభవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి నూనె అనిల్, మండల అధ్యక్షుడు వడ్లకొండ రవి, బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ ఎనగందుల శ్రావణ్, రాపాక ప్రశాంత్, మంచాల సుమన్, పెండ్యాల గణేష్, ప్రకాష్, ప్రశాంత్, దినేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



సాయం అందిస్తున్న ఆటో యూనియన్ బాధ్యులు

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన ఆటో యూనియన్ సభ్యుడు కేశపాక రమేష్ తల్లి ఎల్లమ్మ ఇటీవల మరణించింది. కాగా ఆటో యూనియన్ సభ్యులు బుధవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే మండల కేంద్రానికి చెందిన గుంజె పూలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా ఎల్లమ్మ కుమారుడి రమేష్ స్నేహితులు బుధవారం రూ.10 వేల ఆర్థిక సాయం అందించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అంత్యక్రియల కోసం..

గీసుకొండ : మండల కేంద్రానికి చెందిన కోట ఎల్లయ్య అనారోగ్యంతో మృతి చెందగా అతడి అంత్యక్రియల కోసం అదే గ్రామానికి చెందిన స్టేట్ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మినారాయణ రూ.5వేల సాయం చేశారు. బుధవారం నగదును సర్పంచ్ దౌడు బాబు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు కర్ణకంటి రాంమూర్తి, కోట ఎల్లయ్య, చేరాలు మృతుడి సమీప బంధువులకు అందించారు.

ఎన్‌టీఆర్‌తోనే రాజకీయ చైతన్యం



వర్ధన్నపేట: ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చాడా మరియా సురేఖ తదితరులు



సంగెం: నివాళులర్పిస్తున్న శ్రీనివాసాచారి

వర్ధన్నపేట : తెలుగుదేశం వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నందమూరి తారకరామారావు వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని ఇల్లంద గ్రామంలోని ఎన్‌టీఆర్ విగ్రహానికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చాడా మరియా సురేఖ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వర్ధన్నపేట పట్టణంలోని స్వామివివేకానంద విగ్రహం వద్ద చాడా మరియా ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. నాయకులు మాగి సందీప్, మారపల్లి రవి, చాడా కర్ణాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి

సంగెం : మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నందమూరి తారకరామారావు రాజకీయ ప్రవేశంతోనే సామాన్య ప్రజల్లో రాజకీయ చైతన్యం వచ్చిందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్నోజు శ్రీనివాసాచారి అన్నారు. ఎన్‌టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం తీగరాజుపల్లి చౌరస్తాలో పార్టీ జెండా ఆవిష్కరణ చేసి, ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే రామారావుకు భారత రత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నల్లబెల్లి : మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత నందమూరి తారక రామారావు వర్ధంతిని మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఎన్‌టీఆర్ చిత్రపటానికి మండల బాధ్యుడు మురికి రవీందర్ గుప్త పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వల్లె పర్వతాలు, మనుగొండ ప్రసాద్, నీల సుధాకర్, జక్కుల రవి, భాస్కర్, కనకం కొర్నేల్, రవి, రాజు, శ్రీను పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండల కేంద్రంలో దివంగత నేత నందమూరి తారకరామరావు వర్ధంతిని టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మండల అధ్యక్షుడు వీరాడి మల్లారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.

గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలి

మామునూరు : ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు తక్షణమే ప్రభుత్వ ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, వర్ధన్నపేట నియోజవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో చింత ప్రకాశ్, మన్నెబాబురావు, శివ రామకృష్ణ ఆధ్వర్యంలో గుడిసెవాసుల ఐక్యవేదిక సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు హాజరై మాట్లాడారు. గుడిసెవాసులందరు తమ ఐక్యతను చాటుతూ ముందుకు వెళ్తే గుడిసె స్థలాలు మీ సొంతమవుతాయని తెలిపారు. 43, 44 డివిజన్ల పరిధిలో ఏర్పాటు చేసిన గుడిసెవాసులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలంతో పాటు గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వడ్డెపల్లి ప్రకాశ్, పసునూరి అనిల్, రాజు, గద్దం రఘు, నరేష్, కిట్టు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.